హైదరాబాద్
29-7-2023
సంపుటి:08
సంచిక: 329
పేజీలు: 4
వెల: రూ.5/-

CEO & Editor : G. PRUDHVIRAJ

RNI NO: TELTEL/2016/73311


www.samasamajam.in

# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

# 31న కేబినెట్ భేటీ

- వచ్చే ఎన్నికల దృష్ట్యా పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం
- ఎజెండాలో 40 నుంచి 50 వరకు అంశాలు... నిరుద్యోగ భృతి లాంటి అమలు కాని హామీలు, పెండింగ్ అంశాలపై చర్చించే చాన్స్
- కొత్త హామీలు, పథకాల ప్రకటనపైనా పరిశీలన!

3లో

# వరదలతో రాష్ట్రం అతలాకుతలం

**భారీ వర్షాలు, వరదలతో రాష్ట్రం అతలాకుతలం.. నాలుగు జిల్లాల్లో తీవ్ర నష్టం**



- నిండా నీటిలో మునిగి ఘొల్లుమంటున్న ఓరుగల్లు
- సర్వం కోల్పోయి బోరుమంటున్న మోరంచపల్లి
- బంధువులను కోల్పోయిన ఆవేదనలో కొండాయి
- బోరుమంటున్న మోరంచపల్లి
- సర్వం కోల్పోయిన దీన స్థితిలో గ్రామస్తులు
- నిత్యావసరాల నుంచి ఎలక్ట్రానిక్ పరికరాల దాకా నష్టం
- కోళ్లు, పశువులూ కొట్టుకుపోయిన వైనం

జయశంకర్ భూపాలపల్లి జిల్లా: మోరంచపల్లిలో గురువారం రాత్రి వరదలో గొర్రె ఓదిరెడ్డి, గొర్రె వజ్రమ్మ దంపతులు, గడ్డ మహాలక్ష్మి, గంగిడి సరోజన గల్లంతయ్యారు. వారి కోసం గ్రామస్తులు, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది ముమ్మరంగా గాలిస్తున్నారు. శుక్రవారం రాత్రి వరకు కూడా వారి ఆచూకీ దొరకలేదు.సంగారెడ్డి జిల్లా కంది మండలం చిద్రుప్ప గ్రామ పెద్ద చెరువులో కృష్ణ అనే యువకుడు, మెదక్ జిల్లా హవేలీ ఘన్‌పూర్‌లో పడమంచి నర్సింహులు, సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో రాములు చెరువులో చేపల వేటకు వెళ్లి మృతి చెందారు. ఖమ్మం రూరల్ మండలం జలగంనగర్‌కు చెందిన పెంద్ర సతీశ్ (23) గురువారం రాత్రి మున్నేటి వరదలో గల్లంతుకాగా. శుక్రవారం మృతదేహం లభ్యమైంది. భద్రాద్రి

3లో

## సెమీకండక్టర్ల పరిశ్రమకు రెడ్ కార్పెట్

**కొత్త యూనిట్లకు 50% ఆర్థిక సాయం**

**300 కాలేజీల్లో సెమీకండక్టర్ కోర్సులు**

**సెమికాన్ ఇండియా-2023లో మోదీ వెల్లడి**

గాంధీనగర్, జూలై 28: సెమీకండక్టర్ల పరిశ్రమకు తమ ప్రభుత్వం రెడ్ కార్పెట్ పరుస్తోందని ప్రధాని మోదీ వెల్లడించారు. సెమీకండక్టర్ల తయారీ కోసం కొత్త యూనిట్లను ఏర్పాటు చేసే సంస్థలకు 50% ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు. గుజరాత్ రాజధాని గాంధీనగర్‌లో శుక్రవారం జరిగిన సెమికాన్ ఇండియా-2023 సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా దేశ, విదేశీ పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రపంచ పారిశ్రామిక విప్లవాలకు వివిధ సమయాల్లో ప్రజలు


3లో

## ‘అవిశ్వాసం’పై చర్చ ఆగస్టు 2 లేదా 3న!

- ఈ నెల 31న నిర్దిష్ట తేదీ ఖరారు
- మణిపూర్‌పై పట్టు వీడని ప్రతిపక్షాలు

న్యూఢిల్లీ, జూలై 28(ఆంధ్రజ్యోతి): మణిపూంఅంశంపై పార్లమెంటు)లో చర్చ, ప్రధాని మోదీ ప్రకటనకు పట్టుబడుతూ ప్రతిపక్షాలు ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానంపై ఆగస్టు 2 లేదా 3 తేదీల్లో చర్చ జరగనున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు చర్చ తేదీని సోమవారం ఖరారు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. మంగళవారం (ఆగస్టు 1) ప్రధాని మోదీ మహారాష్ట్ర పర్యటనకు వెళ్లనున్నారు. అవిశ్వాస తీర్మానంపై చర్చ సందర్భంగా ఆయన సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో వచ్చే బుధ, గురువారాల్లోనే అవిశ్వాస తీర్మానంపై చర్చ, సమాధానం, ఓటింగ్‌కు అవకాశం ఉంది. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు


3లో



## ఉదారంగా వరద సాయం

- అధికార యంత్రాంగం మానవీయ కోణంలో వ్యవహరించాలి
- శిబిరాల నుంచి తిరిగి వెళ్లేటప్పుడు ప్రతి కుటుంబానికి
- రూ.2 వేలు.. వ్యక్తులైతే రూ.1,000 సాయం
- కచ్చా ఇళ్లు దెబ్బ తిన్న బాధితులకు రూ.10వేలు అందించాలి..
- ఎలాంటి వర్గీకరణ వద్దు
- ముంపు ప్రాంతాల్లో 25 కేజీల బియ్యం, కిలో చొప్పున
- ఉల్లిపాయలు, ఆలూ, కందిపప్పుతోపాటు పామాయిల్
- శిబిరాల్లో మంచి సదుపాయాలు.. అధికారులే ఉంటే
- ఎలా కోరుకుంటారో అలాంటివే కల్పించాలి

3లో



2లో

## ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా..ఏం చర్యలు తీసుకున్నారు?

**వరదలపై వార్‌రూమ్ ఎందుకు ఏర్పాటు చేయలేదు?**

**సోమవారం దీనిపై సమగ్ర నివేదిక అందజేయండి**

**రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నత న్యాయస్థానం ఆదేశం**

హైదరాబాద్: రాష్ట్రంలో వర్షాలు, వరదల కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ‘రాష్ట్రంలో వరద కారణంగా ఇంతవరకు ఎంతమంది చనిపోయారు? డిజాస్టర్ చట్టం ప్రకారం ఎంతమందిని రక్షించారు? గోదావరి తీర ప్రాంత గ్రామాల రక్షణకు ఏం చర్యలు చేపట్టారు? బాధితులకు కనీస సౌకర్యాలు అందిస్తున్నారా? వరదలపై


3లో

# కృష్ణమ్మకు భారీగా వరద

- ప్రమాదకర స్థాయిలో మున్నేరు ప్రాజెక్ట్ వద్ద వరద
- పొంగిపొర్లుతున్న కట్టలేరు, బుడమేరు, వైరా

అమరావతి: తెలంగాణలోని ఖమ్మం, ఏపీలోని ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో విస్తారంగా కురిసిన వర్షాలకు మున్నేరు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. ఎన్టీఆర్ జిల్లాలోని మున్నేరు ప్రాజెక్ట్ వద్ద శుక్రవారం మధ్యాహ్నం 1.97 లక్షల క్యూసెక్కుల ప్రవాహం రాగా.. అదే స్థాయిలో దిగువకు వదిలేశారు. ఈ ప్రవాహానికి కట్టలేరు, బుడమేరు, పాలేరు తదితర వాగులు, వంకల ప్రవాహం తోడవుతుండటంతో పులిచింతల ప్రాజెక్ట్‌కు దిగువన కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చింది. ప్రకాశం బ్యారేజీలోకి శుక్రవారం సాయంత్రం 6 గంటలకు 2,60,875 క్యూసెక్కులు చేరుతుండటంతో.. అంతే స్థాయిలో వరదను 55 గేట్లను 6 అడుగులు, 15 గేట్లను ఏడు అడుగుల మేర ఎత్తి సముద్రంలోకి వదిలేస్తున్నారు. జూలై చివరి వారంలో ప్రకాశం బ్యారేజీకి ఈ స్థాయిలో వరద రావడం.. గేట్లు ఎత్తి సముద్రంలోకి ఈ స్థాయిలో వరదను వదిలేయడం ఇదే తొలిసారి. ఖమ్మం, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో శుక్రవారం వర్షాలు తెరిపి ఇవ్వడంతో శనివారం ప్రకాశం బ్యారేజీలోకి చేరే ప్రవాహం తగ్గనుంది.

3లో



**ఎగువ కృష్ణాలో స్థిరంగా ప్రవాహం**

పశ్చిమ కనుమల్లో వర్షాలు తగ్గుముఖం పట్టినా కృష్ణా ప్రధాన పాయలో ఎగువన వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతోంది. ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్‌ల నుంచి 1.66 లక్షల క్యూసెక్కులు దిగువకు వదిలేస్తున్నారు. ప్రధాన ఉప నది తుంగభద్రలో వరద కాస్త తగ్గింది. తుంగభద్ర డ్యామ్‌లోకి 1.07 లక్షల క్యూసెక్కులు

3లో

# కృష్ణమ్మకు భారీగా వరద

(మొదటి పేజీ తరువాయి)

చేరుతుండటంతో నీటి నిల్వ 59 టీఎంసీలకు చేరుకుంది. జూరాలకు ఎగువ నుంచి 1.22 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా.. అంతే స్థాయిలో స్పిల్ వే గేట్లు, విద్యుత్ ఉత్పత్తి చేస్తూ దిగువకు వదిలేస్తున్నారు. జూరాల నుంచి 1,20,390 క్యూసెక్కులు, స్థానికంగా కురిసిన వర్షాల వల్ల సుంకేశుల బ్యారేజ్ నుంచి 4,311, హంద్రీ నుంచి 117 వెరసి 1,24,818 క్యూసెక్కులు శ్రీశైలంలోకి చేరుతుండటంతో నీటి నిల్వ 45.53 టీఎంసీలకు చేరుకుంది. ఎగువ నుంచి భారీగా వరద వస్తున్న నేపథ్యంలో శనివారం శ్రీశైలం ప్రాజెక్ట్‌లోకి చేరే వరద పెరగనుంది. ఇక తెలంగాణలో హైదరాబాద్, నల్గొండ జిల్లాల్లో విస్తారంగా కురిసిన వర్షాలకు మూసీ నుంచి పులిచింతలలోకి 55,144 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి నిల్వ 28.03 టీఎంసీలకు చేరుకుంది. మరో 17 టీఎంసీలు చేరితే పులిచింతల ప్రాజెక్ట్ గేట్లు ఎత్తేయనున్నారు.

# సెమీకండక్టర్ల పరిశ్రమకు రెడ్ కార్పెట్

(మొదటి పేజీ తరువాయి)

వెలిబుచ్చిన ఆకాంక్షలే కారణమని తెలిపారు. నాలుగో పారిశ్రామిక విప్లవం(4.0) భారత ఆకాంక్షలకు అద్దంపడుతుందని విశ్వసిస్తున్నట్టు చెప్పారు. దేశంలో సెమీకండక్టర్ పరిశ్రమ వృద్ధి చెందేలా పర్యావరణ వ్యవస్థను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. "సెమికాన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా మేం అనేక రాయితీలు ఇస్తున్నాం. ఇప్పుడు వీటిని మరింత పెంచాం. సాంకేతిక సంస్థలకు 50% వరకు ఆర్థిక సాయం అందిస్తాం" అని మోదీ చెప్పారు. దేశ పురోగతికి సెమీకండక్టర్ పరిశ్రమ సాక్ష్యంగా నిలుస్తుందన్నారు. "ఏడాది కిందట భారత్‌లో పెట్టుబడులు ఎందుకు పెట్టాలని కొందరు ప్రశ్నించారు. కానీ, ఇప్పుడు వారే ఎందుకు పెట్టుబడులు పెట్టకూడదని అంటున్నారు. సెమీకండక్టర్ రంగంలో భారత్ పెట్టుబడులకు గమ్యస్థానంగా మారింది" అని వివరించారు. రానున్న ఐదేళ్లలో దేశ వ్యాప్తంగా 300 కాలేజీల్లో సెమీకండక్టర్ డిజైన్ కోర్సులు ప్రవేశ పెట్టనున్నట్టు తెలిపారు. దీంతో లక్ష మందికిపైగా డిజైన్ ఇంజనీర్లు అందుబాటులోకి వస్తారని చెప్పారు. ప్రపంచ పారిశ్రామిక రంగం 4.0కు చేరుకుందన్న ప్రధాని, తొలి పారిశ్రామిక విప్లవానికి అమెరికాకు ఎలాంటి సంబంధం ఉందో.. నాలుగో పారిశ్రామిక విప్లవానికి, భారత్‌కు అలాంటి బంధమే ఉందన్నారు. ప్రపంచంలో తన బాధ్యత ఏమిటో భారత్ అర్థం చేసుకుందని, అందుకే మిత్రదేశాలతో కలిసి అనేక కార్యక్రమాలకు రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేసినట్టు వివరించారు. ఇటీవలే క్వాంటమ్ సాంకేతికతకు పెద్దపీట వేస్తూ నేషనల్ క్వాంటమ్ మిషన్‌ను అనుమతించామని, త్వరలోనే నేషన్ రిసెర్చ్ ఫౌండేషన్ బిల్లును పార్లమెంటులో ప్రవేశ పెట్టనున్నామని మోదీ తెలిపారు. సెమీకండక్టర్ల పరిశ్రమకు విద్యుత్ అత్యంత కీలకమని, అందుకే సౌర విద్యుత్ సామర్థ్యాన్ని గత దశాబ్దకాలంలో 20 రెట్లు వృద్ధి చేశామని చెప్పారు. ఈ దశాబ్దం చివరినాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధనం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. విధానపరమైన సంస్కరణలు సెమీకండక్టర్ ఎకోసిస్టమ్‌కు దన్నుగా నిలుస్తాయని చెప్పారు. కార్పొరేట్ పన్నులను తక్కువగా విధించే దేశాల సరసన భారత్ కూడా చేరిందని తెలిపారు. కాలం చెల్లిన చట్టాలను బుట్టదాఖలు చేశామని, తద్వారా సెమీకండక్టర్ల పరిశ్రమకు రెడ్ కార్పెట్ పరిచామని వివరించారు. "సెమీకండక్టర్ పరిశ్రమకు భారత్ అతిపెద్ద కండక్టర్‌గా అవతరించింది" అని సభికుల హర్షధ్వానాల మధ్య ప్రధాని ప్రకటించారు. "భారత దేశ ప్రజాస్వామ్యం, ప్రజలు, రాయితీలు వంటివి మీ వ్యాపారాలను రెండింతలు, మూడింతలు చేస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు" అని మోదీ భరోసా ఇచ్చారు.

# ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా..ఏం చర్యలు తీసుకున్నారు?

(మొదటి పేజీ తరువాయి)

వార్‌రూమ్ ఎందుకు ఏర్పాటు చేయలేదు? ఎన్నికలప్పుడు ఏర్పాటు చేస్తారు కానీ.. వరదలు లాంటి అత్యవసర సమయంలో ఏర్పాటు చేయరా?..'అని ప్రశ్నించింది. పూర్తి వివరాలతో ఓ నివేదికను సోమవారం అందజేయాలని స్పష్టం చేసింది. రాష్ట్రంలో కొద్ది రోజులుగా వర్షాలు, వరదల నేపథ్యంలో ప్రభుత్వం ఏం చర్యలు తీసుకుందో వెల్లడించడం లేదని, రక్షణ చర్యలు తీసుకునేలా రాష్ట్ర సర్కారుకు ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ హైకోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ వినోద్‌కుమార్ ధర్మాసనం శుక్రవారం ప్రత్యేకంగా విచారణ చేపట్టింది.

**రాష్ట్ర ప్రభుత్వం ఏం చెప్పడం లేదు..**

'వర్షాలు, వరదలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్రం హెచ్చరించింది. ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా చర్యలు తీసుకోవాలని సూచించింది. రాష్ట్రంలో వరదల కారణంగా 19 మంది మృతి చెందారని పత్రికల్లో వస్తున్న వార్తలు తెలియజేస్తున్నాయి. వరదలు ఇంకా కొనసాగే అవకాశం ఉందని కేంద్రం మరోసారి తెలియజేసింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం వరదల నుంచి ప్రజలను రక్షించడానికి ఏం చర్యలు తీసుకున్నారు? ఎంత మంది మరణించారు? లాంటి వివరాలను వెల్లడించడం లేదు. కడెం ప్రాజెక్టు వద్ద తీవ్ర భయానక పరిస్థితి కొనసాగుతోంది. ప్రాజెక్టు తెగితే వందల గ్రామాలు నీట మునగడంతో పాటు లక్షల మంది నిరాశ్రయులుగా మారే అవకాశం ఉంది..'అంటూ న్యాయవాదులు చిక్కుడు ప్రభాకర్, పల్లె ప్రదీప్‌కుమార్ కోర్టు దృష్టికి తెచ్చారు. దీంతో 'వరద బాధితులకు తక్షణమే కనీస సౌకర్యాలు అందేలా ఏర్పాట్లు చేయాలి. కడెం ప్రాజెక్టు లోతట్టు ప్రాంతాల్లో ఉన్న వారిని భద్రతా చట్ట ప్రకారం చర్యలు చేపట్టి వెంటనే రక్షించాలి. ఎలాంటి ప్రాణ నష్టం సంభవించకుండా చూడాలి..'అని ప్రభుత్వానికి హైకోర్టు సూచించింది. తదు పరి విచారణను ఈ నెల 31కి వాయిదా వేసింది.



# వరదలతో రాష్ట్రం అతలాకుతలం

(మొదటి పేజీ తరువాయి)

కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం అయ్యన్నపాలెంకు చెందిన ఎస్‌కే గాలిబ్ పాషా (33) ఈ నెల 26న భార్యతో గొడవ పడి బయటకు వెళ్లిపోయాడు. శుక్రవారం తిప్పనపల్లి వద్ద వాగులో ఆయన మృతదేహం లభించింది. బుధవారం భద్రాద్రి జిల్లా ములకలపల్లి మండలం కుమ్మరిపాడులోని పాములేరు వాగులో కొట్టుకుపోయిన కుంజా సీత (60) మృతదేహం శుక్రవారం మామిళ్లగూడెం శివారులోని వాగులో బయటపడింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో వివిధ చోట్ల వాగుల్లో గల్లంతైన నలుగురు మరణించారు. కొమురం భీం జిల్లా ఆసిఫాబాద్ మండలం తుంపెల్లి మొరంవాగులో రేకల కౌశిక్ (9), మోహన్ (40) కొట్టుకుపోయారు. ఆదిలాబాద్ జిల్లా సిరి కొండ మండలం వైపేట్‌కు చెందిన సంగం గంగాధర్ (45) స్థానిక వాగులో గల్లంతయ్యాడు. భూపాలపల్లి అర్బన్: మొత్తం 285 ఇళ్లు.. అందులో నాలుగు పూర్తిగా ధ్వంసమయ్యాయి.. మిగతావి పాక్షికంగా దెబ్బతిన్నాయి.. ఏ ఇంట్లో చూసినా పేరుకుపోయిన ఒండ్రుమట్టి.. చెల్లాచెదురుగా ఉన్న సామగ్రి.. బైక్‌లు, ఇతర వాహనాలు ఎక్కడున్నాయో తెలియదు.. తినటానికి తిండి లేదు.. తాగేందుకు నీరు లేదు.. కోళ్లు, పశువులు కొట్టుకుపోయాయి.. సర్వం కోల్పోయిన స్థితిలో జయశంకర్ జిల్లా మోరంచపల్లి గ్రామం బోరుమంటోంది. మరోవైపు గల్లంతైన నలుగురి ఆచూకీ దొరకక.. వారి కుటుంబాలు ఆవేదనలో కొట్టుమిట్టాడు తున్నాయి. గల్లంతైన గొర్రె ఓదిరెడ్డి, గొర్రె వజ్రమ్మ దంపతులు, గడ్డ మహాలక్ష్మి, గంగిడి సరోజనల ఆచూకీ కోసం గ్రామస్తులు, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది గాలిస్తున్నారు.

**ఏ ఆధారమూ లేని పరిస్థితిలో..**

గురువారం తనను చుట్టేసిన మోరంచవాగు వరద ఉధృతికి మోరంచపల్లి గ్రామం సర్వం కోల్పోయింది. ఇళ్లలో సుమారు 3 నుంచి 4 మీటర్ల ఎత్తు వరకు వరద నీరు చేరింది. ప్రతి ఇంట్లో బియ్యం, పప్పుల వంటి నిత్యావసరాల నుంచి టీవీలు, ఫ్రిడ్జ్‌లు, వాషింగ్ మెషీన్లు వంటి ఎల్రక్టానిక్ పరికరాల దాకా వస్తువులన్నీ నీట మునిగిపోయాయి. కొన్ని వరద ఉధృతికి కొట్టుకు పోయాయి. గ్రామంలో మొత్తం 285 ఇళ్లు ఉండగా 4 ఇళ్లు పూర్తిగా, 281 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఒండ్రు మట్టి, ఇసుక మేట, చెత్తాచెదారంతో నిండిపోయాయి. శుక్రవారం వరద తగ్గాక గ్రామస్తులు ఇళ్లలో ఒండ్రుమట్టిని ఎత్తిపోస్తూ, తడిసిన వస్తువులను ఆరబెట్టుకుంటూ కనిపించారు. వరద తాకిడికి కొన్ని ఇళ్ల పునాదులు కూడా కదలడం, ఇంటి గోడలు, ప్రహరీలు కూలిపోవడం ఆందోళనకరంగా మారింది. మోరంచపల్లి గ్రామం పూర్తిగా వ్యవసాయంపైనే ఆధారపడి ఉంది. దాదాపు ప్రతి ఇంట్లో కుటుంబ పోషణ నిమిత్తం గేదెలు, కోళ్లు పెంచుకుంటున్నారు.

# 31న కేబినెట్ భేటీ

హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ ఎన్నికల నోటిఫికేషన్‌కు మరో మూడు నెలలే సమయం మిగిలి ఉన్న నేపథ్యంలో అమలు చేయాల్సిన కార్యాచరణపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకోవడానికి వీలుగా సీఎం కేసీఆర్ ఈ నెల 31న రాష్ట్ర మంత్రివర్గ సమావేశాన్ని నిర్వహించనున్నారు. రాష్ట్ర సచివాలయంలో మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే కేబినెట్ భేటీకి భారీ ఎజెండాను ఖరారు చేశారు.

40 నుంచి 50 అంశాలపై మంత్రివర్గం చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశముంది. గత శాసనసభ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన 'నిరుద్యోగ భృతి'లాంటి అమలు కాని హామీలతో పాటు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఇతర అంశాలపై చర్చించే అవకాశాలున్నాయి. పాక్షికంగా అమలైన పంట రుణాల మాఫీ లాంటి అంశాలు కూడా చర్చకు రానున్నట్టు తెలిసింది.

అలాగే ఎన్నికలు పురస్కరించుకుని కొత్త హామీల ప్రకటనకు ఉన్న అవకాశాలను కేబినెట్ సమీక్షించనున్నట్టు సమాచారం. సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణానికి రూ.3 లక్షల ఆర్థిక సహాయం అందించడానికి ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకం కింద దరఖాస్తుల స్వీకరణను ప్రభుత్వం ఇంకా ప్రారంభించలేదు. ఇందుకు సంబంధించి మంత్రివర్గం నిర్ణయం తీసుకోవచ్చు.

**ఉద్యోగులకు వేతన సవరణ, పదోన్నతులు..**

గత ఏప్రిల్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కొత్త పీఆర్సీ వర్తింపజేయాల్సి ఉండగా, ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం వేతన సవరణ కమిషన్ (పీఆర్సీ)ను నియమించలేదు. ఈ నేపథ్యంలో పీఆర్సీ ఏర్పాటు, మధ్యంతర భృతి(ఐఆర్) ప్రకటనకు ఉన్న అవకాశాలను మంత్రివర్గం సమీక్షించే అవకాశాలున్నాయి. ఉపాధ్యాయులు, భాషా పండితులు, పీఈటీలు దీర్ఘకాలంగా పదోన్నతులు, బదిలీల కోసం నిరీక్షిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో అట్టడుగు స్థాయిలో పనిచేస్తున్న 2 లక్షల మందికి పైగా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు చాలీచాలని వేతనాలతో దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్నారు. నెలల తరబడిగా వేతనాలు అందకపోవడంతో కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఈ అంశాలపైనా కేబినెట్ చర్చించ వచ్చని చెబుతున్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు వేతన సవరణ అమలు, సంస్థ ఆర్థిక పరిస్థితిపై మంత్రివర్గం చర్చించి ఓ నిర్ణయం తీసుకోనుంది. ఈ అంశాన్ని కేబినెట్ ఎజెండాలో చేర్చారు. వర్షాలు, వరదలపై... భారీ వర్షాలు, వరదలతో రాష్ట్రంలో జరిగిన నష్టం, భవిష్యత్తులో తీసుకోవాల్సిన నివారణ చర్యలపై కేబినెట్ సమీక్షించనుంది. వానాకాలం పంటల పరిస్థితిని అంచనా వేయడంతో పాటు అనుసరించాల్సిన ప్రత్యామ్నాయ వ్యవసాయ విధానాలపై చర్చించనుంది. రహదారులు తెగిపోవడం వంటి వాటిపై చర్చించి నష్టాన్ని అంచనా వేయనుంది. యుద్ధప్రాతిపదికన రోడ్ల పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలపై నిర్ణయం తీసుకోనుంది.



# ఉదారంగా వరద సాయం

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టం చేశారు. ఇలాంటి విపత్తు పరిస్థితుల్లో ఉండాల్సిన దాని కన్నా ఎక్కువగా మానవత్వంతో పని చేయాలనే విషయాన్ని అంతా దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. ఒక రూపాయి అదనంగా ఖర్చు అయినా సరే బాధితులకు అండగా ఉండాలన్నారు. కలెక్టర్లు మాకు మంచి చేశారనే మాటే వినిపించాలని, మన వల్ల జిల్లాకు మంచి జరిగిందని, మంచి కలెక్టర్ అనిపించుకునేలా పని చేయాలని సూచించారు. ప్రధానంగా ఐదు జిల్లాల్లో కలెక్టర్లు అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాలన్నారు. సహాయ శిబి రాల నుంచి బాధితులు తిరిగి ఇళ్లకు వెళ్లేటప్పుడు ప్రతి కుటుంబానికి రూ.2 వేలు చొప్పున ఇవ్వాలని, వ్యక్తులైతే రూ.1,000 చొప్పున అందచేయాలని ఆదేశించారు.

కచ్చా ఇళ్లను నష్టపోయిన బాధితులకు రూ.10 వేల చొప్పున సాయం అందించి ఆదుకోవాలని నిర్దేశించారు. శిబిరాల్లో తలదాచుకునే బాధితులకు మంచి సదుపాయాలను కల్పించడంతోపాటు ముంపు ప్రాంతాల్లో బియ్యం, ఉల్లిపాయలు, కందిపప్పు, బంగాళా దుంపలు, పామాయిల్ పంపిణీ చేయాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు, నదుల్లో వరద ప్రవాహం, సహాయ, పునరావాస కార్యక్రమాలపై ముఖ్యమంత్రి జగన్ శుక్రవారం తన క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఏమన్నారంటే...

**ఐదు జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి**

అల్లూరి సీతారామరాజు, ఏలూరు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి. ప్రస్తుతం భద్రాచలం వద్ద నీటిమట్టం 49.60 అడుగులు ఉంది. శనివారం 53.81 అడుగులకు చేరుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ధవళేశ్వరం వద్ద ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో 13 లక్షల క్యూసెక్కులు ఉంది. ఇది రేపటికి (శనివారం) సుమారు 16 లక్షలకు చేరుకుని ఆ తర్వాత క్రమేపీ తగ్గుముఖం పట్టే అవకాశాలున్నట్లు అంచనా. ప్రవాహం 17 లక్షల క్యూసెక్కులు ఉంటే మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. ప్రస్తుతం రెండు, మూడు ప్రమాద హెచ్చరికల మధ్యలో అంటే 13 -7 లక్షల క్యూసెక్కుల లోపే ప్రవాహం ఉంటుంది. గతేడాది గోదావరిలో 26 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహాన్ని చూశాం.

**శిబిరాల్లో మంచి సదుపాయాలు**

లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇప్పటికే కొన్ని చోట్ల ఖాళీ చేశారు. 16 లక్షల క్యూసెక్కుల ప్రవాహాన్ని దృష్టిలో పెట్టుకుని ఆ మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలి. అవసరం అనుకుంటే పరిస్థితిని అంచనా వేసి మిగిలిన వారిని కూడా సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. బాధితులకు సహాయ శిబిరాల్లో మంచి సదుపాయాలు కల్పించాలి. శిబిరాల్లో స్వయంగా అధికారులే ఉంటే ఎలాంటి సదుపాయాలను కోరుకుంటారో అలాంటి సదుపాయాలన్నీ కల్పించాలి. ఆ మేరకు జాగ్రత్తలు తీసుకోవాలి. మరో ముఖ్యమైన అంశం.. కచ్చా ఇళ్ల విషయంలో కలెక్టర్లు మానవీయ దృక్పథంతో ఉదారంగా వ్యవహరించాలి. కచ్చా ఇళ్ల బాధితులను సహాయ శిబిరాల నుంచి తిరిగి పంపించేటప్పుడు రూ.10 వేల చొప్పున సాయంగా అందించాలి.

# 'అవిశ్వాసం'పై చర్చ ఆగస్టు 2 లేదా 3న!

(మొదటి పేజీ తరువాయి)

ఆగస్టు 11 వరకు జరగనున్నాయి. ఆమోదం పొందాల్సిన కీలక బిల్లులు చాలానే ఉన్నాయి. వీటిలో అవిశ్వాస తీర్మానానికి తేదీ నిర్ణయం సహా ఢిల్లీ సర్వీసులకు సంబంధించిన ఆర్డినెన్స్ స్థానంలో బిల్లు ప్రధానమైనది. ఈ నేపథ్యంలో వచ్చే వారం జరిగే సమావేశాలు ప్రభుత్వానికి చాలా కీలకమైనవి. ప్రతిపక్షాల తీరుచూస్తుంటే అత్యంత ఆసక్తిగా సాగే అవకాశం కనిపిస్తోంది. కాగా, ఢిల్లీ బిల్లుకు ఉభయ సభల ఆమోదం పొందిన తర్వాతే అవిశ్వాస తీర్మానానికి తేదీ నిర్ణయించాలని, అవిశ్వాసం నెగ్గిన వెంటనే పార్లమెంటును వాయిదా వేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

**మధ్యాహ్నంలోపే వాయిదా..**

ప్రతిపక్షాలు నిరసనను కొనసాగించడంతో శుక్రవారం కూడా మణిపూర్‌పై ఉభయ సభలు మధ్యాహ్నంలోపే వాయిదా పడ్డాయి. రాజ్యసభను ఉదయం 11.46కు, లోక్‌సభను 12.41కు వాయిదా వేశారు. అన్ని సభా కార్యకలాపాలను పక్కనపెట్టి.. మోదీ ప్రభుత్వంపై తాము పెట్టిన అవిశ్వాస తీర్మానం మీద చర్చించాలంటూ లోక్‌సభలో కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ చౌధురి(%ూాంస్త్రఅతీ ఝఅయిఖఅ జస్త్రుబంస్త్రబతీఱ%) డిమాండ్ చేశారు. విపక్ష సభ్యులు నిరసన వీడక పోవడంతో ప్రశ్నోత్తరాలు సాగడం మీకిష్టం లేదా? అని స్పీకర్ ఓం బిర్లా వారిని ప్రశ్నించారు. మధ్యాహ్నం తర్వాత సమావేశమైనా కార్యకలాపాలు కొద్దిసేపే సాగాయి. గందరగోళం మధ్యే లోక్ సభలో డెంటల్ కమిషన్ బిల్లు, గనులు, ఖనిజ వనరుల బిల్లును ఆమోదించారు. కాగా రాజ్యసభలో 267 నిబంధన కింద చర్చ ప్రారంభించాలని, ప్రధాని సభకు రావాలని ప్రతిపక్షాలు పట్టుబట్టాయి. తనతో వాగ్వావాదానికి దిగిన తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ డెరెక్ ఓబ్రయిన్‌పై చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నాటకాలు ఆడొద్దంటూ, బల్లను చరవొద్దంటూ తీవ్రంగా హెచ్చరించారు. ఆయన వినకపోవడంతో సభను వాయిదా వేశారు. మణిపూర్‌పై చర్చ కోరుతూ శుక్రవారం 47 మంది విపక్ష ఎంపీలు నోటీసులిచ్చారు. ప్రశోత్తరాలు కీలకం అంటూనే.. నోటీసుపై స్వల్ప చర్చకు ధన్‌ఖడ్ అనుమతించారు. ఇంతలో డెరెక్ స్పందిస్తూ అదంతా తమకు తెలుసని నోటీసుపై చర్చ జరగాలని వ్యాఖ్యానించారు. దీనిపై గతంలోనూ ఇలానే ప్రవర్తించారంటూ ఆయనపై ధన్‌ఖడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చైర్మన్ స్థానం పట్ల అగౌరవంగా ప్రవరిస్తున్నారని మండిపడ్డారు.

**లిథియం తవ్వకం ప్రైవేటుకు!**

మణిపూర్ హింసపై చర్చించాలంటూ లోక్‌సభలో విపక్షాలు చేపట్టిన నిరసనల మధ్యే గనులు, ఖనిజాల అభివృద్ధి నియంత్రణ సవరణ బిల్లుతో పాటు జాతీయ దంతవైద్య కమిషన్ బిల్లు, నర్సింగ్, ప్రసూతి వైద్య కమిషన్ బిల్లులను ఆమోదించారు. గనులు, ఖనిజాల అభివృద్ధి నియంత్రణ సవరణ బిల్లుకు ఆమోదంతో లిథియం సహా 6 అణు ఖనిజాలు, బంగారం, వెండి, వజ్రాలు వంటి వాటిని తవ్వి తీసేందుకు ప్రైవేటు రంగానికి అనుమతి లభించింది. ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా మైనింగ్ చేస్తున్న 12 రకాల అణు ఖనిజాల్లో.. ఆరింటిని (లిథియం, బెరీలియం, నియోబియం, టైటానియం, టాంట్లామ్, జిర్కోనియం) ప్రైవేటు రంగానికి కేటాయించారు. దీని ద్వారా దేశంలో ఖనిజాల అన్వేషణ, మైనింగ్ పెరుగుతుందని భావిస్తున్నట్లు కేంద్రం పేర్కొంది. అలాగే లోతైన ప్రదేశాల్లో దొరికే ఖనిజాలైన బంగారం, వెండి, రాగి, జింక్, సీసం, కోబాల్ట్, ప్లాటినం, వజ్రాలు వంటి వాటిని గుర్తించడం, తవ్వి తీయడం ఎంతో ఖర్చుతో కూడుకున్నదని.. అందుకే ప్రైవేటు రంగానికి అప్పగిస్తున్నట్లు తెలిపింది. బిల్లులోని సవరణలు గేమ్ చేంజర్‌గా మారనున్నాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. కాగా, పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని సవరించే ప్రతిపాదనేదీ లేదని కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో తెలిపింది.

# భారత జట్లు నేరుగా క్వార్టర్స్‌కు..

న్యూఢిల్లీ: ఆసియా క్రీడల్లో భారత పురుషులు, మహిళల క్రికెట్ జట్లు నేరుగా క్వార్టర్‌ఫైనల్ దశ నుంచి ఆడనున్నాయి. ఆసియాలో టాప్-4లో ఉన్న భారత్‌తో పాటు పాకి స్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్ జట్లకు కూడా ర్యాంకింగ్స్ ఆధారంగా ఇరు విభాగాల్లోనూ రౌండ్-8 నుంచి తలపడే అవకాశం లభించింది. జూన్ ఒకటిని ఈ ర్యాంకింగ్స్‌కు కటాఫ్ తేదీగా తీసుకున్నారు. ఇక, టీమిండియా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్.. ఆసియాడ్‌లో భారత్ కనుక ఫైనల్ చేరితేనే జట్టు తరపున ఆడేం దుకు చాన్సుంటుంది. ఇటీవల బంగ్లాదేశ్‌తో వన్డే మ్యాచ్‌లో అనుచిత ప్రవర్తన కారణంగా హర్మన్‌పై రెండు మ్యాచ్‌ల నిషేధం విధించిన సంగతి తెలిసిందే. దరిమిలా ఆసియా క్రీడల క్వార్టర్స్, సెమీఫైనల్‌కు కౌర్ దూరం కానుంది. క్వార్టర్‌ఫైనల్లో అసోసియేట్ సభ్య దేశ జట్టుతో, సెమీస్‌లో పూర్తిస్థాయి సభ్యదేశ టీమ్‌తో మన మహిళలు తలపడనున్నారు.



# ప్రయోగాలకే చాన్స్!

**నేడు విండీస్‌తో రెండో వన్డే**

**రాత్రి 7 గంటల నుంచి**

**డీడీ స్పోర్ట్స్‌లో..గెలిస్తే భారత్‌దే సిరీస్**



బ్రిడ్జిటౌన్: 'మా ఆటగాళ్లకు తగిన మ్యాచ్ ప్రాక్టీస్‌దలభించాలనేదే మా ఉద్దేశం. ఇందుకోసం వీలైనప్పుడల్లా అవకాశాలిస్తుంటాం'.. తొలి వన్డే ముగిశాక కెప్టెన్ రోహిత్ శర్మ చేసిన వ్యాఖ్యలివి. ఎందుకంటే ఈ మ్యాచ్‌లో స్వల్ప లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత బ్యాటింగ్ ఆర్డర్ పూర్తిగా మారింది. మిడిలార్డర్ ఆటగాళ్లను ముందే పంపించి రోహిత్ పదేళ్ల తర్వాత ఏడో నెంబర్‌లో బరిలోకి దిగగా.. కోహ్లీ అసలు బ్యాటింగే చేయలేదు. వన్డే ప్రపంచకప్ సమీపిస్తుండడంతో యువ ఆటగాళ్లను పరీక్షించేందుకు చేసిన ప్రయత్నమిది. ఈనేపథ్యంలో శనివారం వెస్టిండీస తో జరిగే రెండో వన్డేలోనూ టీమిండియా ప్రయోగాలు చేయాలనుకుంటోంది. అలాగే ఇందులో గెలిస్తే సిరీస్ వశమవుతుంది. అదే జరిగితే.. ఆఖరి మ్యాచ్‌కు వెటరన్ ఆటగాళ్లకు విశ్రాంతినిచ్చి పూర్తిగా యువ ఆటగాళ్లనే ఆడించినా ఆశ్చర్యం లేదు. అటు గురువారం ఆటలో విండీస్ బౌలర్లు మెరుగ్గానే రాణించినా బ్యాటర్లు విఫలం కావడం ఆతిథ్య జట్టును దెబ్బతీసింది. తొలి మ్యాచ్‌లో విండీస్ కనీసం 200 పరుగులైనా చేసుంటే భారత్‌కు గట్టి పోటీ ఎదురయ్యేదేమో..

**ఆత్మవిశ్వాసంతో..:**

ఈ మ్యాచ్‌కు భారత జట్టులో మార్పులుండకపోవచ్చు. అయితే 115 పరుగుల ఛేదనలో ఇషాన్(%×ంష్ట్రుఖుఅ%) జోరు చూపినా మిగతా బ్యాటర్లు మాత్రం ఇబ్బందిపడడం టీమ్ మేనేజ్‌మెంట్‌ను ఆందోళనపరుస్తోంది. సునాయాసంగా మ్యాచ్‌ను ముగిస్తారనుకున్నా.. ఐదు వికెట్లు కోల్పోవడం గమనార్హం. సూర్యకుమార్ ఎప్పటిలాగే నిరాశపరిచాడు. శ్రేయాస్, రాహుల్ ఫిట్‌నెస్ నిరూపించుకుంటే అతడి స్థానం గల్లంతవుతుంది. ఇక బౌలింగ్‌లో స్పిన్నర్ల హవా కన్పించింది. చాహల్‌ను కాదని జట్టులో చోటు దక్కించుకున్న కుల్దీప్ ఈ అవకాశాన్ని చక్కగా వినియోగించుకున్నాడు. అటు పేసర్ ముకేశ్ అరంగేట్రంలోనే ఆకట్టుకున్నాడు. తన మొదటి ఓవర్‌నే మెయిడిన్‌గా వేయడంతో పాటు ఓవరాల్‌గా కెరీర్‌లో తొలి వికెట్‌ను కూడా సాధించాడు.

**పోటీనిస్తారా?**

రెండో వన్డేలో భారత్‌ను సవాల్ చేయాలంటే విండీస్ తమ స్థాయికి మించి ఆడాల్సిందే. టాప్-5 ఆటగాళ్లలో నలుగురు రెండంకెల స్కోర్లు చేసినా.. ఎక్కువ సమయం క్రీజులో నిలువలేకపోయారు. కెప్టెన్ హోప్ ఒంటరి పోరాటం ఫలితాన్నివ్వలేదు. అయితే బౌలర్లు మాత్రం భారత బ్యాటర్లను బాగానే ఇబ్బందిపెట్టారు. స్పిన్నర్లు మోటీ, కారియా పరుగులను కట్టడి చేయడంతో పాటు వికెట్లు తీయగలిగారు. ఇక నేటి మ్యాచ్‌లో బ్యాటర్ మేయర్స్ స్థానంలో కాసీ కార్టీ ఆడే అవకాశం ఉంది.

**జట్లు (అంచనా)**


**భారత్:** రోహిత్ శర్మ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్, కోహ్లీ, ఇషాన్ కిషన్, హార్దిక్, సూర్యకుమార్, జడేజా, శార్దూల్, కుల్దీప్, ఉమ్రాన్, ముకేశ్.

**విండీస్:** బ్రాండన్ కింగ్, అథనజె, హోప్ (కెప్టెన్), కార్టీ, హెట్‌మయెర్, పావెల్, షెఫర్డ్, డ్రేక్స్, కారియా, మోటీ, సీల్స్.

**పిచ్, వాతావరణం**

తొలి మ్యాచ్‌లో ఇక్కడి పిచ్ బౌన్స్‌తో పాటు టర్న్ కావడంతో పేసర్లు, స్పిన్నర్లు రాణించారు. ఈసారి టాస్ గెలిస్తే భారత్ బ్యాటింగ్ తీసుకునే చాన్స్ ఉంది. ఒకవేళ బంతి టర్న్ అయితే బ్యాటర్లు ఎలా రాణిస్తారనేది తేలనుంది. మ్యాచ్‌కి వర్షం ఆటంకం కలిగించే అవకాశముంది.



# ఇదీ 'కిక్' సినిమాకు డబుల్ 'ఎక్స్‌ట్రా' : వక్కంతం వంశీ

నితిన్ హీరోగా వక్కంతం వంశీ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాకు 'ఎక్స్‌ట్రా' అనే టైటిల్ ఖరారు చేశారు. 'ఆర్డినరీ మేన్ ' అనేది ట్యాగ్‌లైన్ . ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్ గా నటిస్తున్నారు. శ్రేష్ఠ్ మూవీస్, ఆదిత్యా మూవీస్ అండ్ ఎంటర్‌టైన్మెంట్స్, రుచిర ఎంటర్‌టైన్మెంట్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం డిసెంబరు 23న విడుదల కానుంది.

తాజాగా ఆదివారం ఈ సినిమా టైటిల్, ఫస్ట్‌లుక్, రిలీజ్ డేట్‌ను ప్రకటించారు మేకర్స్. "కిక్' సినిమా తర్వాత ఆ రేంజ్‌లో క్యారెక్టర్ బేస్డ్ స్క్రిప్ట్‌తో 'ఎక్స్ ట్రా' సినిమా తెరకెక్కుతోంది. ఆడియన్స్ రోలర్ కోస్టర్ లాంటి ఎక్స్‌పీరియన్స్ ఇస్తూనే, నవ్విస్తూ సర్‌ప్రైజ్‌లతో మెప్పిస్తుంది మా సినిమా" అన్నారు వక్కంతం వంశీ. ఈ సినిమాకు సంగీతం: హారిస్ జైరాజ్.

# 'భోళాశంకర్' ట్రైలర్ విడుదల ఎప్పుడంటే..

చిరంజీవి టైటిల్ రోల్‌లో నటించిన తాజా చిత్రం 'భోళాశంకర్' ట్రైలర్ రిలీజ్‌కు ముహూర్తం ఖరారైంది. ఈ నెల 27న ట్రైలర్ విడుదలకానుంది. మెహర్ రమేష్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో చిరంజీవి సరసన తమన్నా నటించగా, ఆయన చెల్లెలి పాత్రలో కీర్తీ సురేష్ నటించారు. అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై రామబ్రహ్మం సుంకర నిర్మించారు. ఈ సినిమా ఆగస్టు 11న థియేటర్స్‌లో రిలీజ్ కానున్న సంగతి తెలిసిందే. కాగా 'భోళాశంకర్' ట్రైలర్‌ను ఈ నెల 27న(గురువారం) విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ ఆదివారం అధికారికంగా ప్రకటించి, చిరంజీవి లుక్‌ని రిలీజ్ చేసింది. చేతిలో కత్తి పట్టుకుని సీరియస్ లుక్‌లో నడిచి వస్తున్నారు చిరంజీవి. ఈ సినిమాలో సుశాంత్, రఘుబాబు, మురళీ శర్మ, రవిశంకర్, 'వెన్నెల' కిషోర్, తులసి కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: మహతి స్వర సాగర్, కెమెరా: డడ్లీ, లైన్ ప్రొడక్షన్: మెహర్ మూవీస్.



# కుశలమా!

సూర్య హీరోగా నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'కంగువ'. శివ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ దిశా పటానీ హీరోయిన్. స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్పై కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. ఆదివారం(జూలై 23) సూర్య పుట్టినరోజు సందర్భంగా 'కంగువ' టీజర్‌ని విడుదల చేశారు మేకర్స్. 'కొండల కోనల్లో కోటి పులులు పట్టినోడు, ముక్కోటి చుక్కలెక్కి దిక్కులే ల్ల గెలిచినోడు, ఒక్కడే ఒక్క వీరుడురా.. వాడే కంగ' వంటి డైలాగులు టీజర్‌లో ఉన్నాయి. 'కుశలమా' అంటూ సూర్య చెప్పే డైలాగ్‌తో టీజర్ ముగుస్తుంది.

"చారిత్రక నేపథ్యంతో రూపొందుతోన్న చిత్రం 'కంగువ'. సూర్య కెరీర్‌లో భారీ బడ్జెట్‌తో ఈ మూవీ తెరకెక్కుతోంది. త్రీడీలో విజువల్ వండర్‌గా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇచ్చేందుకు టీమ్ శ్రమిస్తోంది. పాన్ వరల్డ్ మూవీగా పది భాషల్లో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. సూర్య బర్త్ డే సందర్భంగా తెలుగు, ఇంగ్లీష్, హిందీ, తమిళ్, కన్నడ, మలయాళ భాషల్లో టీజర్‌ని రిలీజ్ చేశాం.. మరో నాలుగు భాషల్లో త్వరలోనే విడుదల చేస్తాం. వచ్చే ఏడాది వేసవిలో 'కంగువ' రిలీజ్ కానుంది" అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఏజే రాజా, కో ప్రొడ్యూసర్: నేహా జ్ఞానవేల్ రాజా.



Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in